క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- మాతృశ్రీనగర్ ఫీడర్ పరిధిలో ..ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు మాతృశ్రీనగర్, కల్వరి టెంపుల్ రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ తెలిపారు.
- ప్రేమ్‌నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 02.30 గంటల నుంచి సాయంత్రం 04.30 గంటల వరకు మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ మెయిన్ రోడ్డు, ప్రేమ్‌నగర్ బి బ్లాక్, ప్రేమ్‌నగర్ వెనుక వైపు, హనీఫ్ కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గచ్చిబౌలి: విద్యుత్ సంబంధిత మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టీఎన్‌జీవోస్ ఫేజ్–2 లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ తెలిపారు.

రుణాల మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం

హఫీజ్‌పేట్ : పీఎం స్వానిధి పథకం కింద చందానగర్ సర్కిల్ 21 పరిధిలోని స్ట్రీట్ వెండర్లకు బ్యాంకు రుణాలను అందిస్తున్నట్లు చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ వంశీకృష్ణ, పీఓ ఉషారాణిలు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎం స్వానిధి పథకం కింద సర్కిల్ పరిధిలోని స్ట్రీట్ వెండింగ్ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నెంబర్, బ్యాంకు పాసు పుస్తకం, ఓటరు గుర్తింపు కార్డు జిరాక్స్ పత్రాలతో సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

13న బాల బృందావనం

రాయదుర్గం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం బాలబృందావనం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'ది స్టోరీ ఆఫ్ రియల్ ఇండిపెండెన్స్' అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించవచ్చు.

కార్పొరేటర్ పర్యటన



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మెట్టుకుమార్

పటాన్‌చెరు టౌన్: గోనెమ్మ బస్తీలో నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు అంచనా వేయాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గోనెమ్మ బస్తీలో డ్రైనేజీ సమస్య ఉందని స్థానిక కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా గురువారం ఆయన సమస్యను పరిశీలించారు.

టీఏఎస్ ఎగ్జిక్యూటివ్ కమిటీలో హెచ్‌సీయూ ప్రొఫెసర్



ప్రొ.ప్రకాశ్‌బాబు

రాయదుర్గం: తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రకాశ్‌బాబు ఎన్నికయ్యారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని బయో టెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (ఏపీఏఎస్) 1963లో ఏర్పాటు చేశారు. అయితే రాష్ట్ర విభజన తర్వాత ఇది కాస్తా తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (టీఏఎస్)గా మార్చడం జరిగింది. ప్రొఫెసర్ ప్రకాశ్‌బాబు పరిశోధనా బృందం న్యూరో క్లినిషియన్ల సహకారంతో మెదడు వ్యాధుల ప్రాంతంలో పనిచేస్తోంది. న్యూరో డీజెనరేటివ్ వ్యాధులు, సెరిబ్రల్ ఇస్కీమియా(స్ట్రోక్) సెరిబ్రల్ మలేరియా ప్రధాన పరిశోధనలు. ఆయనను పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు అభినందించారు.

ఆలయాల్లో చోరీ

జిన్నారం(పటాన్‌చెరు): మల్లికార్జున స్వామి, ఎల్లమ్మతల్లి ఆలయాల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండల కేంద్రమైన గుమ్మడిదలలో గురువారం ఉదయం వెలుగు చూసింది. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ రెండు తులాల బంగారం, హుండీ, సీసీటీవీ ఫుటేజ్ హార్డ్ డిస్క్, ఎత్తుకెళ్లినట్టు తెలిపారు. ఆలయాల్లో దొంగతనానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని స్థానిక ప్రజలు కోరారు. ఎస్ఐ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు ఆలయాలను పరిశీలించారు.

ఈ బడి కనిపించలేదా ?

- ప్రహరీ లేక లోపల పాముల సంచారం
- ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు అడ్డా
- ఇదీ హఫీజ్‌పేట్ ప్రభుత్వ పాఠశాల దుస్థితి



ఓల్డ్ హఫీజ్‌పేట్ ప్రాథమిక పాఠశాల

హఫీజ్‌పేట్ : మన ఊరు– మన బడిలో భాగంగా పాఠశాలలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నది. అయితే హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్‌పేట్ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు మన ఊరు–మన బడి మొదటి విడతలో చోటు దక్కలేదు. కాగా ఈ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఇందులో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 172 మంది విద్యార్థులు, ఏడుగురు ఉపాధ్యాయులు, ఒక హెచ్‌ఎం ఉన్నారు. పాఠశాల సమస్యలపై పలుమార్లు ఎంఈఓ, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. బడి చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. పాఠశాలకు ప్రహరీ లేకపోవడం విషసర్పాలు సంచరిస్తుండడంతో విద్యార్థులు భయపడుతున్నారు. ఇకబడి ముందు ఉన్న ఖాళీ స్థలంలో భారీ వాహనాలను పార్క్ చేస్తుండడంతో విద్యార్థులు ఆడుకోవడానికి స్థలం లేదు. కాగా స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి కొన్ని వసతులు కల్పించారు. ఇప్పటికైనా 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో హఫీజ్‌పేట్ ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.





బీటలు వారిన పాఠశాల భవనం గోడలు



పాఠశాల ఆవరణలోని ఖాళీ ప్రదేశంలో ప్రైవేట్ వాహనాలు నిలిపిన దృశ్యం

ప్రహరీ లేక తీవ్ర ఇబ్బందులు



పాఠశాల చుట్టు ప్రహరీ లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్కూల్ ముందు ఉన్న ఖాళీ స్థలంలో ప్రైవేట్ వాహనాలు నిలపడంతో విద్యార్థులకు ఆడుకోవడానికి వీలు లేకుండా పోయింది. వాహనాల వల్ల ఏం ప్రమాదం జరుగుతుందోనని భయం వేస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రహరీ నిర్మించాలి.

– కుమార్, జనప్రియనగర్

నూతన భవనం నిర్మించాలి



హఫీజ్‌పేట్ ప్రభుత్వ పాఠశాల భవనం గోడలు శిథిలావస్థకు చేరాయి. విద్యార్థులు ఆడుకోవడానికి ఆట స్థలం లేదు. అక్రమంగా వాహనాలు నిలిపి అందరికీ ఇబ్బందులు కలిగిస్తున్నారు. ప్రభుత్వం పాఠశాలకు నూతన భవనాన్ని నిర్మించాలి.

–ఉమ కరుణ, హఫీజ్‌పేట్‌వాసి

దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



ర్యాలీగా వస్తున్న ఏఐసీఎఫ్ సభ్యులు

పటాన్‌చెరు టౌన్: దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఏఐసీఎఫ్ (ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్ చార్జ్ టీడీఎస్ మణి అన్నారు.ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ పిలుపు మేరకు ఆగస్టు 10న నిర్వహించే బ్లాక్ డేలో భాగంగా పటాన్‌చెరు తహసీల్దార్ భాస్కర్‌కు ఏఐసీఎఫ్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చినప్పటినుండి ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా దళిత క్రైస్తవులకు చేసిందేమీ లేదన్నారు. దళిత క్రైస్తవులు న్యాయమైన రాజ్యాంగ హక్కుల సాధనకై కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కుట్రపూరితంగా తీసుకువచ్చిన రాష్ట్రపతి ఉత్తర్వును నిరసిస్తూ ప్రతి ఏటా ఆగస్టు 10న బ్లాక్ డే నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన సంఘటనపై న్యాయం చేయాలన్నారు. ఏఐసిఎఫ్ సభ్యులు ప్రదీప్ విజయ సారథి, ప్రభాకర్, జేమ్స్, మనోహర్, జాన్ రాజు, బెనర్జీ, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

పటాన్‌చెరు టౌన్: ప్రజాసేవే లక్ష్యంగా ఎస్ఎంఆర్ వ్యవస్థాపకుడు నీలం మధు ముదిరాజ్ ఏర్పాటు చేసిన యువసేన పనిచేస్తుందని ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు సాయి బాబు ముదిరాజ్ అన్నారు. పట్టణంలోని కుమ్మరి బస్తీకి చెందిన నర్సింలు గుండెపోటుతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు సాయిబాబు గురువారం తమ వంతుగా పది వేల రూపాయలను నర్సింలు కుటుంబ సభ్యులకు అందజేశారు.ఎస్ఎంఆర్ సభ్యులు పాండు, సాయిరాజ్, భరత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

- అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి
- బొటానికల్ గార్డెన్‌లో వృద్ధుల వ్యాయామశాల ప్రారంభం

గచ్చిబౌలి: వ్యాయామంతో సీనియర్ సిటిజన్లు ఆరోగ్యంగా ఉంటారని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో వృద్ధుల వ్యాయామశాలను ఎఫ్‌డీసీ వైస్ చైర్మన్, ఎండి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొటానికల్ గార్డెన్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌కు ఐకాన్‌గా బొటానికల్ గార్డెన్‌ను తీర్చిదిద్దుతామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్, డైరెక్టర్ ఎం.జె.అక్బర్, అసిస్టెంట్ డైరెక్టర్ స్కైలాబ్, జీఎం రవీందర్ రెడ్డి, ఓఎస్‌డీటీపీ తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బొటానికల్ గార్డెన్‌లో వ్యాయామశాలను వృద్ధురాలితో కలిసి ప్రారంభిస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎఫ్‌డీసీ వైస్ చైర్మన్,ఎండీ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

హరితహారంలో భాగస్వాములవ్వాలి

మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి



మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, కమిషనర్ జ్యోతిరెడ్డి

పటాన్‌చెరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తొమ్మిదో విడత హరితహారంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై విజయవంతం చేయాలని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి కోరారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 20వ వార్డు సాయిభగవాన్ కాలనీ, 13వ వార్డు బసవేశ్వర కాలనీలలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రజలకు మున్సిపల్ చైర్మన్ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత తొమ్మిది సంవత్సరాలుగా ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో హరితహారం కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించడంతోపాటు.. ఖాళీ స్థలాలు పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, కౌన్సిలర్లు కృష్ణ, బోయిని బాలరాజు, లావణ్య శ్రీధర్ రెడ్డి, అనిరుద్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు యూనస్ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిన బీజేపీ శ్రేణులు

పటాన్‌చెరు టౌన్: చలో మెదక్ మహాధర్నాకు పటాన్‌చెరు బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్‌లతో నాయకులు వెళ్లారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ రామకృష్ణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవేందర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్ , డివిజన్ అధ్యక్షులు నాగరాజ్ యాదవ్, భారతీనగర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు రాజగోపాల్ యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆదిత్య తదితరులు తరలి వెళ్లారు.

మోజ్ ఆధ్వర్యంలో వినోద పోటీల ఫైనల్స్ 13న...

సాక్షి, సిటీబ్యూరో: షార్ట్ వీడియో కంటెంట్‌కు పట్టం కట్టే వేదిక మోజ్ యాప్ ఆధ్వర్యంలో పాటలు, వినోద కార్యక్రమాల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. దీనిలో చిన్ననాటి జ్ఞాపకాలను ఒక థీమ్‌గా, ఫర్మాయిష్/సాంగ్ రిక్వెస్ట్ రెండో థీమ్‌గా, తుది పోటీ కోసం 90లు వర్సెస్ 2000 థీమ్‌లుగా నిర్ణయించామని తెలిపారు. ఈ పోటీల ఫైనల్స్ ఈ నెల 13 దాకా కొనసాగుతాయని ఆసక్తి కలిగిన నగరవాసులు పాల్గొనాలని కోరారు.

నాన్ టీచింగ్ పోస్టులకు రాత పరీక్ష

రాయదుర్గం: మనూలో నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి రాత పరీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఈనెల 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. లోయర్ డివిజన్ క్లర్క్, సెక్షన్ ఆఫీసర్, మెయింటెనెన్స్ అసిస్టెంట్ పోస్టులకు ఆగష్టు 19వ తేదీ, ల్యాబ్ అటెండెంట్, సీనియర్ రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టులకు ఆగష్టు 20 ,21వ తేదీలలో పరీక్షలు నిర్వహిస్తారు.అభ్యర్థులు మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు.

కరోనా పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 12 మందికి కొవిడ్ ర్యాపిడ్ ఆంటీజన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా 8 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి

మియాపూర్: స్టాలిన్‌నగర్‌లోని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని స్టాలిన్‌నగర్ సంక్షేమ సంఘం సభ్యులు మియాపూర్ ఏడీఈని కోరారు. గురువారం మియాపూర్‌లోని విద్యుత్ కార్యాలయంలో ఏడీఈ హరికృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో నూతన పోల్స్ ఏర్పాటు చేయాలని, రెండో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి స్తంభాలకు వేలాడుతున్న కరెంట్ వైర్ల స్థానంలో కేబుల్ వైర్లను ఏర్పాటు చేయాలన్నారు. వర్షాకాలం విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ఏడీఈని కోరారు. కాలనీ సంక్షేమ సంఘం సహాయ కార్యదర్శి నాగభూషణం, కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, నర్సింగ్, చరీష్ తదితరులున్నారు.

సమీక్ష సమావేశం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ వార్డు కార్యాలయంలో గురువారం స్థానిక కార్పొరేటర్ పుష్ప నగేష్ జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం, జలమండలి అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంజూరైన సీసీ రోడ్డు పనులను త్వరగా ప్రారంభించాలని సూచించారు. డ్రైనేజీ పనులు పూర్తి కాకపోవడం వలన సీసీ రోడ్డు వేయలేకపోతున్నామని జలమండలి అధికారులు వెంటనే డ్రైనేజ్ పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. పైపులైన్ పనులు పూర్తయిన వెంటనే సీసీ రోడ్లను ప్రారంభించాలని అధికారులను కోరారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం: ఎమ్మెల్యే గాంధీ



రాజీవ్‌నగర్‌లో సమస్యలను ఎమ్మెల్యేకు వివరిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, స్థానికులు

రాయదుర్గం: గోపన్‌పల్లిలోని రాజీవ్‌నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. త్వరలోనే రాజీవ్‌నగర్‌కాలనీలో యూజీడీ పైప్‌లైన్ పనులను చేపట్టేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్థానికులకు హామీ ఇచ్చారు. గురువారం గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి గోపన్‌పల్లి రాజీవ్‌నగర్, సోఫాకాలనీల్లో డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ శ్రీనివాస్, ఏఈ సునీల్, జలమండలి మేనేజర్ అభిషేక్, నాయకులు గణేష్‌ముదిరాజ్, రాజునాయక్, శ్రీనివాస్‌యాదవ్, సురేందర్, వినోద్, శ్రీనివాస్‌నాయక్, మల్లేష్, నర్సింహ్మారాజు, నవాజ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆదిత్యనగర్‌లో కాంగ్రెస్ బస్తీ బాట



ఆదిత్యనగర్‌లో స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న రఘునాథ్ యాదవ్

హఫీజ్‌పేట్ : మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లో గురువారం కాంగ్రెస్ నాయకులు బస్తీబాట నిర్వహించారు. ఈ బస్తీ బాటలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రఘునాథ్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు పది సంవత్సరాల నుంచి బస్తీలను పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. ముఖ్యంగా తాగునీరు, డ్రైనేజీ, రోడ్డు సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ నాయకులు బస్తీలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారే తప్ప పనులు ప్రారంభించలేదని ఆరోపించారు. స్థానిక కార్పొరేటర్ బస్తీలోని మంచినీటి సమస్యలను గాలికి వదిలేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు హమీద్, రషీద్, హసన్, షరీఫ్, భరత్ యాదవ్, రాజేష్ యాదవ్, కిరణ్‌రెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హోప్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం



ఉద్యోగులు, సిబ్బందికి జ్యూట్ బ్యాగులు, గొడుగులు, చీరలు పంపిణీ చేసిన దృశ్యం

ఎస్‌బీఐ ఏరియా జనరల్ మేనేజర్ రజనీ బాలామజుందర్

గచ్చిబౌలి: హోప్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏరియా జనరల్ మేనేజర్ రజనీబాలామజుందర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని స్టేట్ బ్యాంక్ లెర్నింగ్ సెంటర్‌లో హోప్ ఫౌండేషన్ 8వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవా దృక్పదంతో సంస్థను ఏర్పాటు చేసి 8 ఏళ్ళుగా సేవలను కొనసాగించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ శ్రీనివాస్‌రావు, నితిన్, హరికృష్ణ, మధు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తోపుగుండ మహిపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శంకర్, అజయ్, శ్రీనివాస్, విజయ్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ

హఫీజ్‌పేట్ : చందానగర్‌లోని హోప్ ఫౌండేషన్ కార్యాలయంలో గురువారం 8వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ వార్షికోత్సవం సందర్భంగా 6 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో భీంరావు, రెడ్డి ప్రవీణ్‌రెడ్డి, మధు, శంకర్ ముదిరాజ్ పాల్గొన్నారు.



గడపగడపకూ బీజేపీ రవన్న ప్రజాయాత్ర ప్రారంభం



హఫీజ్‌పేట్ డివిజన్‌లో పాదయాత్ర చేస్తున్న మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, రవికుమార్

హఫీజ్‌పేట్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం పాదయాత్ర చేస్తున్నామని మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం గడపగడపకు బీజేపీ రవన్న ప్రజాయాత్ర సందర్భంగా 71వ రోజు హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్‌నగర్, జనప్రియనగర్, జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లో నిర్వహించారు. ఈ ప్రజాయాత్రకు ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్, నియోజకవర్గం కన్వీనర్ రాఘవేంద్రరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిపాలన గాడి తప్పి నాయకులు, అధికారులు దోచుకు తింటున్నారన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ముఖం చాటేసిన నాయకులు మళ్ళీ ఎలా వచ్చి ఓట్లు అడుగుతారో సమాధానం చెప్పాలన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ పాదయాత్రలో పార్టీ డివిజన్ అధ్యక్షులు శ్రీధర్‌గౌడ్ నాయకులు రవిగౌడ్, శ్రీశైలం, మాణిక్‌రావు, శ్రీనివాస్ యాదవ్, లక్ష్మణ్, ప్రసాద్, పృథ్వీ గౌడ్, రవి ముదిరాజ్, అశోక్, ఆకుల లక్ష్మణ్, జగన్ గౌడ్, విజయేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన



భాగ్యనగర్‌కాలనీ: శాతవాహననగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ కాలనీవాసులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతా ప్రమాణాలతో రాజీ పడకుండా చేపట్టి, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు. రోడ్డుపై నీరు నిలిచి పోకుండా లెవెలింగ్ చేయాలన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో యాదిరెడ్డి, నరసింహ, కృష్ణమూర్తి, మదన్‌మోహన్, పోశెట్టి గౌడ్, హనుమంత రాజు, కెవిఎస్ఎన్ రాజు, సత్యనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225455
9912225462